క్లుప్తంగా

కాలువ గట్లపై ఆక్రమణల తొలగింపు



బాదంపూడి వద్ద కాలువ గట్లపై ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ఉంగుటూరు: ఏలూరు గోదవరి కాలువ గట్లపై ఆక్రమణల తొలగింపు ప్రక్రియ మొదలైంది. సోమవారం బాదంపూడి, వెల్లమిల్లి రెవెన్యూ పరిధిలో ఏలూరు కాలువ గట్లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. పశువులు పాకలు, ఇతర కట్టడాలను తొలగించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎంపీడీవో మనోజు పర్యవేక్షిస్తున్నారు.

విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలు



హారతి ఇస్తున్న యువతులు

దెందులూరు: దెందులూరులోని విష్ణు ఆలయంలో నవనీత హారతి కార్యక్రమం సోమవారం ఉదయం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకుని ఆలయంలో ఎనిమిది రోజులుగా ప్రతిరోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం దేవత మూర్తులకు అభిషేకాలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో దెందులూరు మండలం రామదండు కమిటీ సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



గుండుగొలనులో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ విగ్రహం

భీమడోలు: గుండుగొలను బీసీ కాలనీలోని కనకదుర్గాదేవి అమ్మవారి పరివార సహిత నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాంపల్లి సూర్యానారాయణమూర్తి, లంకా శ్రీనివాస శర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుందరంగా అలంకరించారు. అమ్మవారికి గ్రామ పెద్దలు, భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యల పరిష్కారం



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేక అధికారి పూర్ణచంద్రశేఖర్

ఉంగుటూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల ప్రత్యేక అధికారి కె. పూర్ణచంద్రశేఖర్ అన్నారు. సోమవారం నల్లమాడు రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికార యంత్రాంగమంతా ప్రజల వద్దకే వచ్చి మీ భూసమస్యలు పరిష్కరిస్తున్నారని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో పలు సమస్యలపై అర్జీలు అందాయి. ఆయా గ్రామ రెవెన్యూ అధికార్లు, రైతులు పాల్గొన్నారు. మంగళవారం గోపినాథపట్నంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ప్రసాదు వెల్లడించారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

దెందులూరు: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని గంగన్నగూడెం సాయి హైస్కూల్ కరెస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి గంగన్నగూడెంలో రైతు దినోత్సవం నిర్వహించిన వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బోయపాటి సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నత్తనడకన రహదారి అభివృద్ధి పనులు

- రెండు కిలోమీటర్ల రోడ్డు
- రెండు నెలలుగా సాగుతున్న పనులు
- బిల్లులు రాక కొన్ని రోజులుగా నిలిచిపోయిన పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు

భీమడోలు: భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. రహదారిపై గుంతలు పూడ్చే పనులు చేపట్టినా, బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నత్తనడకన సాగిస్తున్నారు. దీనివల్ల కొన్ని రోజులుగా పనులు ముందుకు సాగడం లేదు. రహదారిపై పర్చిన రాళ్లు రోడ్డుపైకి జారిపోవడం, భారీ వాహనాల వల్ల గోతుల్లో వేసిన కంకర నుజ్జునుజ్జు మారి దుమ్ము, ధూళి ఎగసిపడుతుండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దాంతో రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు, భక్తులు వాహనదారులు భీతిల్లిపోతున్నారు. ఏ క్షణం ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఈ రహదారి సులువైన దారి కావడంతో ఈ రోడ్డు వెంబడి గుడికి చేరుకుంటున్నారు. దీనితో భక్తులు పడే పాట్లు వర్ణనాతీతం. రెండు కిలోమీటర్ల పొడవుగల ఈ రహదారి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని రెండు నెలల క్రితం పాలకులు అట్టహాసంగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు మరమ్మతులకు రూ.10లక్షల మంజూరుకాగా కూటమి ప్రభుత్వం మరో రూ.5లక్షలు మంజూరుచేసింది. కేవలం నెలరోజుల్లో పూర్తిచేయాల్సిన గుంతలు పూడ్చే పనులు దీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి. రహదారికి ఓ వైపున మాత్రమే పనులు ప్రారంభించి అక్కడక్కడ గోతులు పూడ్చి మిగిలిన రోడ్డు వెంబడి కంకర గుట్టలు వదిలేసి మౌనం వహిస్తున్నారు. దీనితో కంకర అంతా రోడ్డుపై పడడంతో వాహనాలు అదుపు తప్పడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు రోడ్డుపై లేచిన రాళ్లు



రోడ్డు వెంబడి వేసిన రాళ్ల గుట్టలు



రోడ్డుపై కంకర రాళ్లు నుజ్జునుజ్జుగా మారిన దృశ్యం

చేసిన పనులకు బిల్లులు రాక... నిలిచిన పనులు

ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేసేందుకు అనాసక్తిని చూపుతున్నారు. దీనితో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భీమడోలు జంక్షన్‌లో సీసీ రోడ్డు వేసారు. మిగిలిన భాగంలో గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు నిలిపివేసారు. ఇకనైనా పాలకులు స్పందించి పనులు పూర్తిస్థాయి చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలి



జిల్లా నలుమూలల నుంచి ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి చేరుకునేందుకు ప్రధాన రహదారి ఇది. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. కొన్ని చోట్ల గుంతలు పూడ్చారు. మిగిలిన చోట్ల వదిలేసారు. దీని వల్ల భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

– ఆర్.లింగరాజు, సీపీఎం నాయకులు, భీమడోలు

కూలీల కొరతతో పనుల్లో జాప్యం

రోడ్డు గుంతలు పూడ్చే పనులు సాగుతున్నాయి. భీమడోలు జంక్షన్‌లో సిమెంట్ రోడ్డు కూడా నిర్మించారు. సాంకేతిక కారణాలతో పాటు రోడ్డు నిర్మాణ కూలీల కొరత వల్ల పనులు నిలిచాయి. క్రిస్మస్ పండుగ తర్వాత పనులు ప్రారంభిస్తాం. జనవరిలో సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తిచేస్తాం. ప్రజలు ఆందోళన చెందనవసరం లేదు.

– జే భాస్కరరావు, ఇన్‌చార్జి ఏఈ, ఆర్అండ్‌బీ, భీమడోలు

నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దైవజనులు

దెందులూరు: దెందులూరు ట్రూ లైట్ చర్చి అలుగులగూడెం రోడ్డులో పాస్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన దైవజనులు పల్లి విశాల్ ఓబద్య, దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ నూతన సంవత్సర క్యాలెండర్లను విడుదల చేశారు. హైదరాబాద్ సంఘస్త గాస్పల్ చర్చి దైవజనులు విశాల్ మాట్లాడుతూ నూతన సంవత్సరం అంతా ప్రతి ఒక్కరికీ దేవుని దీవెనలు లభించాలని ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇతర సంఘాల పాస్టర్లు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉత్సాహంగా రైతు దినోత్సవం

ఉంగుటూరు: ఉప్పాకపాడు పాఠశాలలో విద్యార్థులు జాతీయ రైతు దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల సమీపంలో వ్యవసాయం చేస్తున్న మద్దాల నాగేశ్వరరావు అనే రైతును విద్యార్థులు సత్కరించారు. రైతులకు శాలువా కప్పి, పూలదండ వేసి గౌరవించారు. పాఠశాల ఉపాధ్యాయుడు అల్లు శ్రీను మాట్లాడుతూ దేశంలోని అందరి ఆకలి తీర్చే రైతన్నను అందరూ గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

భీమడోలు: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలులోని మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసారు. అనంతరం క్రైస్తవ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ క్రీస్తు వాక్యాల్లో మంచిని గ్రహించి వాటిని అనుసరించాలని, తద్వారా విద్యార్థులు సన్మార్గనంలో నడవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. అనంతరం పాస్టర్లు పిసీ జాషువా పాల్, యు.విజయుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం అంతర కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీల్లో 65 కేజీల విభాగంలో రత్న డిగ్రీ కళాశాల విద్యార్థి సందీప్ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతాకాన్ని సాధించారు. సీఐ, కళాశాల యాజమాన్యం సందీప్‌ను సత్కరించి అభినందించింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంటెంట్ కె.ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్స్ ఆర్.అశోక్, పి.కేసరి, ఇంచార్జి పి.బాలు, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమడోలులో కాంస్య పతకం విజేతను సత్కరిస్తున్న సీఐ యూజే విల్సన్

క్రిస్మస్ వేడుకకు చర్చిలు ముస్తాబు





విద్యుత్ దీపాలంకరణలో దెందులూరులోని చర్చిలు

దెందులూరు: క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు దెందులూరు ఆర్‌సీఎం చర్చిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజా ఆధ్వర్యంలో సహాయ గురువులు కల్యాణ్, సంఘ పెద్దలు, సంఘస్తులు పది రోజులు పాటు శ్రమించి వివిధ రకాల వివిధ రంగుల విద్యుత్ బల్బులను శోభాయమానంగా అలంకరించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

దెందులూరు: దెందులూరు సెయింట్ థెరిస్సా యూపీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం టీచర్స్ సెమీ క్రిస్మస్ వేడుకలు హెచ్ఎం సిస్టర్ టీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేకును టీచర్లు, సిస్టర్లు కలిసి కట్ చేసి విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మాలధారులు జాగ్రత్తలు పాటిస్తే సుఖ ప్రయాణం

భీమడోలు: విజయవాడ దుర్గమ్మ దర్శనానికి కాలినడకను వెళ్లే భవానీ మాలధారులు ప్రయాణంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. జాతీయ రహదారి సూరప్పగూడెం వద్ద ఆదివారం రాత్రి విజయవాడకి కాలినడకను వెళ్తున్న భవానీ మాలధారులకు వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లను సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్ అతికించారు. ఈసందర్భంగా వారు మాలధారులకు కాలినడకన వెళ్లే తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రేడియం స్టిక్కర్ల వల్ల రాత్రి వేళల్లో కాలినడకన వెళ్లే మాలధారులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారన్నారు. రేడియం స్టిక్కర్ల వల్ల వాహన డ్రైవర్లకు మాలధారుల ఉనికి తెలుస్తుందని, దీనితో వల్ల వారు అప్రమత్తమయ్యేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



భవానీ భక్తులకు రేడియం స్టిక్కర్లను అతికిస్తున్న సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూనికలు కొలతల శాఖ నిబంధనలు, చట్టాలపై వినియోగదారులు, వ్యాపారులు, అవగాహన కలిగి ఉండాలని తూనికలు, కొలతలు శాఖ ఉప నియంత్రకులు బీవీ హరిప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక కేపీడీటీ హైస్కూల్లో తూనికలు కొలతల వినియోగం, రైతు బజార్, చికెన్, మటన్, కిరాణా షాపులలో చేసే మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిపై హరిప్రసాద్ మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తూనికలు కొలతలలో జరిగే మోసాలపై అవగాహన కలిగించారు. ఎలక్ట్రానిక్ కాటాలలో మోసాన్ని ఎలా గుర్తించాలో వివరించారు. బంగారం కొనుగోలు బిల్లులో బంగారం బరువు, రాళ్ల బరువు విడిగా ఉండేట్లు చూసుకోవాలన్నారు. పెట్రోల్ కొట్టించుకునేటప్పుడు మీటర్ రీడింగ్ విధిగా జీరో నుంచి మొదలవుతుందో లేదో చూసుకోవాలని, అనుమానం ఉంటే పెట్రోల్ పంప్ డీలర్ వద్ద ఉన్న ఐదు లీటర్ల కొలమానంపై సరి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ సంయుక్త నియంత్రకులు సుధాకర్, సహాయ నియంత్రకులు సాయి రామ్, పరిశీలకులు ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తూనికలు,కొలతల శాఖ అధికారి

చిన్నారులకు రక్త మార్పిడి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో తొమ్మిది మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స అందిస్తున్నట్టు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. రక్తదాతల సహకారంతో బాధిత చిన్నారులకు 1000 నుంచి 1200 రక్త యూనిట్లను సరఫరా చేస్తున్నామని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎన్‌వీవీఎస్ ప్రసాద్ సహకారంతో సోమవారం తలసేమియా చిన్నారులకు వారి తల్లిదండ్రులకు 25 మందికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

దెందులూరు: వాహనదారులు తప్పనిసరిగా కోర్టు ఉత్తర్వులు అనుసరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జానంపేట డ్రైవింగ్ టెస్టింగ్ కార్యాలయ అధికారి బి.భీమారావు, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రబాబు అన్నారు. బయటికి వెళ్లిన ప్రయాణికులు క్షేమంగా తిరిగి ఇంటికి రావాలని కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తూ ఉంటారని ఈ విషయాన్ని వాహనదారులందరూ గుర్తుంచుకోవాలని వారన్నారు. సోమవారం దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి జానంపేట డ్రైవింగ్ టెస్టింగ్ కార్యాలయ ఆవరణలో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమారావు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారులో ప్రయాణిస్తున్న వారు తప్పని సరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులు రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని సూచించారు. విద్యార్థులు బైక్ రేస్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నంబర్ ప్లేట్లను నిబంధనల ప్రకారం వాహనానికి ఉండాలని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, రోడ్డు, రవాణా శాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.భీమారావు

బొమ్మిడిలో పశువైద్య శిబిరం



బొమ్మిడిలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

ఉంగుటూరు: బొమ్మిడిలో సోమవారం పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ, చికిత్సపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు, లేగదూడలకు నట్టల నివారణ మందులు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏలూరు డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ టి.గోవిందరాజు, భీమడోలు సహాయ సంచాలకుడు డాక్టర్ సాయిరమేష్, ఈవోపీఎల్‌డీపీ డాక్టర్ ఏసురత్నం, డాక్టర్లు శిరీష, కిషోర్, సర్పంచి, గ్రామంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు శ్రీకారం



అమ్మవారి ఆలయంలో పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా సంతాన లక్ష్మిగా పేరు పొందిన రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధి చెందిన ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయిగూడెంలోని గ్రామదేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను వైభవంగా కన్నుల పండువగా నిర్వహించేందుకు వేద పండితులతో ముహూర్తాన్ని నిర్ణయించినట్టు గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి 68వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ, ఆలయ అర్చకులతో ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ పందిరి రాట పూజలు చేశారు. ఉత్సవాలను ఫిబ్రవరి 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ముగిసిన వినియోగదారుల వారోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్) ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ వినియోగదారుల వారోత్సవాలు సోమ వారం ముగిశాయి. ముగింపు కార్యక్రమం స్థానిక ఆర్ఆర్‌పేటలోని శర్వాణి స్కూల్‌లో నిర్వహించారు. వినియోగదారుల హక్కులు బాధ్యతలపై, వినియోగదారుల చట్టం -2019పై ప్రధానోపాధ్యాయుడు మురళి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెడ్కాస్ కన్వీనర్ కట్టా సత్యనారాయణ, కో కన్వీనర్ సీపీపీఎస్ రామానుజాచార్యులు న్యాయవాదులు ఎం జోసెఫ్, వై శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

భీమడోలు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణితానికి సంబంధిత ప్రాజెక్టులు, చార్ట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. పజిల్స్, గణిత సజ్జెక్టులోని అంశాలపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాఠశాలలోని వందలాది మంది విద్యార్థులు 300 గణిత ప్రాజెక్టులు, చార్టులను తయారు చేసి ప్రదర్శించారు. అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో చిన్నారులంతా రామానుజన్ నంబర్ 1729 సంఖ్య ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమాల్లో హెచ్ఎం ఎస్‌కే మస్తాన్, టీచర్లు పాల్గొన్నారు.



భీమడోలు మానస స్కూల్లో గణిత ప్రాజెక్టులను తిలకిస్తున్న చిన్నారులు

పోటీతత్వంతోనే ఉన్నత స్థానం

దెందులూరు: పోటీతత్వం నిరంతర సాధనతోనే ఉన్నతమైన భవిష్యత్తు లభిస్తుందని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేలు అన్నారు. సోమవారం వేగవరం హేలాపురి టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు. తొలుత హేలాపురి కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధితో కలిసి నతానియేలు ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల జట్టు, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. సాయంత్రం నిర్వహించిన మ్యాచ్‌లో పీబీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, కై ట్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది.విజేత జట్లను ప్రిన్సిపల్ నతానియేల్ అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నతానియేలు

దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం



దత్త క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాలసుబ్రహ్మణ్య స్వామి దత్తక్షేత్రంలో ప్రత్యేక పూజలు, తైలాభిషేకం సోమవారం నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అర్చకులు సీహెచ్ మణికంఠ కుమార్ శర్మ ఈ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ

ఉంగుటూరు: బొమ్మిడి -1 పాఠశాల విద్యార్థులకు సోమవారం మాజీ ఎంపీపీ మారిశెట్టి ప్రసాదు డైరీలను పంపిణీ చేశారు. హెచ్ఎం బి.ప్రసాదు, బొమ్మిడి నీటి సంఘం అధ్యక్షుడు మద్దాల ఉమామహేశ్వరరావు నాగరాజు పాల్గొన్నారు.

27న వాలీబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక

ఏలూరు రూరల్ : జనవరి 7వ తేదీ నుంచి 13 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాస రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించనున్నారని వివరించారు.

హమాలీలను ప్రభుత్వాలు ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): హమాలీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో దూళ్ల వీరి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏలూరు హమాలీ ముఠా కార్మిక సంఘం 32వ వార్షికోత్సవ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ హమాలీలకు సౌకర్యాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఉచిత తోపుడు రిక్షాలు అందించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ నగర కమిటీ నాయకులు ముంగము అప్పారావు, సందకం అప్పారావు, బుడితి వీరభద్రం, రంగాల నూకరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా దూళ్ల వీరి నాయుడు, ఉపాధ్యక్షుడిగా బి.భూపతి, ప్రధాన కార్యదర్శిగా బద్దా వెంకట్రావు, కోశాధికారిగా ప్రసాదు, సభ్యులుగా రామ్మూర్తి నాయుడు, ధర్మ, సాయి,చిన్న, గోకర్ల లక్ష్మణ్, రాఘవ, బాపూజీ, నారాయణ ఎన్నికయ్యారు.



హమాలీ ముఠా కార్మిక సంఘం నూతన నాయకులు